వన మహోత్సవానికి వేళాయె!

- నేటి నుంచి జీహెచ్‌ఎంసీ నార్త్‌జోన్ పరిధిలో మరూ
- 5 సర్కిళ్లలో 4 లక్షల మొక్కలు నాటేలా ప్రణాళికలు
- ప్రజా పంపిణీకి 1.50 లక్షల మొక్కలు సిద్ధం
- జీహెచ్‌ఎంసీ జోనల్ సమావేశంలో నిర్ణయం


నర్సరీల్లో సిద్ధంగా ఉన్న మొక్కలు

సికింద్రాబాద్: జీహెచ్‌ఎంసీ నార్త్‌జోన్ పరిధిలోని 5 సర్కిళ్లలో ఈనెల 9 నుంచి వన మహోత్సవం కార్యక్రమం ప్రారంభం కానున్నది. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు, అలాగే అన్ని డివిజన్ల ప్రజలకు మొక్కలను పంపిణీ చేసేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు సిద్ధమయ్యారు. ఈ మేరకు సికింద్రాబాద్‌లోని జోనల్ కార్యాలయంలో హార్టికల్చర్ జోనల్ డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌కుమార్ నేతృత్వంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో సికింద్రాబాద్, బేగంపేట్, ముషీరాబాద్, అంబర్‌పేట్, మల్కాజిగిరి సర్కిళ్ల హార్టికల్చర్ అధికారులు, పర్యవేక్షకులు హాజరయ్యారు. గతంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమాలతో ఆశించిన సత్ఫలితాలు రాలేదు. దీంతో ఈసారి పకడ్బందీగా వన మహోత్సవం కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రణాళికలు సిద్ధం చేశారు.

ప్రజల భాగస్వామ్యం..

డివిజన్ల వారీగా నిర్వహించే వన మహోత్సవ కార్యక్రమాల్లో ఆయా ప్రాంతాల ప్రజలను పూర్తి స్థాయి భాగస్వాములను చేయాలని నిర్ణయించారు. నాటిన మొక్కలను సంరక్షించేలా అధికారులు, ఆయా ప్రాంతాల పర్యవేక్షకులు అప్రమత్తంగా ఉండాలని నిర్ణయించారు. తొలి విడతలో ఒక్కో సర్కిల్ పరిధిలో 50 వేల మొక్కలు నాటాలని, అలాగే మరో 30 వేల మొక్కలను ప్రజా పంపిణీ కోసం సిద్ధంగా ఉంచినట్లు వారు తెలిపారు.

ప్రజా ప్రతినిధులకు ఆహ్వానం..

ప్రభుత్వ స్థలాలు, మైదానాల్లో నిర్వహించే వన మహోత్సవ కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లను ఆహ్వానించాలని సర్కిళ్ల అధికారులకు సూచించారు. ప్రజా ప్రతినిధులతో పాటుగా స్వచ్ఛంద సంస్థలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధుల సహకారం తీసుకుంటే మొక్కలు నాటే కార్యక్రమం విజయవంతం అవుతుందని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు.

5 సర్కిళ్ల పరిధిలో..

5 సర్కిళ్ల పరిధిలోని నర్సరీల్లో అంట్లు కట్టి పెంచిన మొక్కలు మాత్రమే కాకుండా శివారు ప్రాంతాల నర్సరీల నుంచి కూడా మొక్కలు దిగుమతి చేసుకునే ఏర్పాట్లు చేసుకున్నారు. కాలనీలు, బస్తీల ప్రజలను జాగృతం చేసి వారి ఇంటి పరిసరాల్లోని స్థలాల్లో మొక్కలు నాటేలా ప్రోత్సహించాలని హార్టికల్చర్ అధికారులకు సూచనలు ఇచ్చారు. నిమ్మ, దానిమ్మ, కరివేపాకు, జామ, అల్ల నేరేడు వంటి అవసరమైన మొక్కలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రహదారులకిరువైపులా, ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల ఆవరణల్లో వేప, రావి, బాహునియా, చింత, అల్ల నేరేడు, గానుగ, బాదం మొక్కలను నాటేందుకు పంపిణీ చేయనున్నారు.

4 లక్షల మొక్కలు సిద్ధం..

తొలి విడత వన మహోత్సవంలో భాగంగా 5 సర్కిళ్ల పరిధిలో మొత్తం 4 లక్షల మొక్కలను సిద్ధంగా ఉంచినట్లు జీహెచ్‌ఎంసీ జోనల్ హార్టికల్చర్ అధికారులు తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ స్థలాలు, మైదానాలు, ప్రభుత్వ కార్యాలయాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఇందులో నాటేందుకు 2.50 లక్షల మొక్కలు వినియోగిస్తామన్నారు. అలాగే మరో 1.50 లక్షల చిన్న తరహా మొక్కలను ప్రజలకు పంపిణీ చేయనున్నారు.

మొక్కల సంరక్షణకు పకడ్బందీ చర్యలు



వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకూ ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. ప్రజలు కూడా సహకారం అందించాలి. కాలనీలు, ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటుకునేందుకు ముందుకు రావాలి. ప్రజలకు పంపిణీ చేసేందుకు అన్ని డివిజన్ల పరిధిలోని పార్కుల్లో మొక్కలను అందుబాటులో ఉంచుతున్నాం.
– రవికిరణ్, జోనల్ కమిషనర్

నేటి నుంచి క్రికెట్ పోటీలు



అమీర్‌పేట: బీఆర్‌ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని మున్సిపల్ గ్రౌండ్‌లో తలసాని యువసేనా ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు అమీర్‌పేట డివిజన్ అధ్యక్షుడు హనుమంత్ రావు తెలిపారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆయన నివాసంలో మంగళవారం కలిసి పోటీలను ప్రారంభించేందుకు రావాలని కోరుతూ ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 4 రోజుల పాటు పోటీలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అశోక్ యాదవ్, వివిధ జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

బోర్డు ఎన్నికలు తక్షణమే జరపాలి



కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సాద కేశవరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం తాడ్‌బండ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాలుగున్నరేళ్లుగా కంటోన్మెంట్‌లో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం లేదన్నారు. రెండేళ్ల క్రితం ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసి, అర్ధంతరంగా నిలిపివేశారన్నారు. ఇప్పటికైనా కేంద్రం కంటోన్మెంట్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైతే ఎంపీ, ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడించి వారి ద్వారా ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తామన్నారు. కంటోన్మెంట్‌లో కేవలం ఒక్క సివిలియన్ నామినేటెడ్ మెంబర్ ఉండడం వల్ల ప్రజా సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ఎన్నికలు నిర్వహిస్తే 8 మంది ప్రజాప్రతినిధులకు బోర్డులో ప్రాతినిధ్యం ఉంటుందన్నారు. ఎన్నికల కోసం ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి రక్షణమంత్రికి గతంలో వినతి పత్రం ఇచ్చినా కేంద్రం సానుకూలంగా స్పందించలేదన్నారు.

ముగ్గురికి జైలు


నిందితులు

సనత్‌నగర్: మద్యం మత్తులో న్యూసెన్స్ చేస్తూ స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్న ముగ్గురు యువకులకు 4 రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ సికింద్రాబాద్ 16వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు. వివరాల్లోకి వెళ్తే.. బేగంపేట పాటిగడ్డకు చెందిన ఎండీ సల్మాన్ (21), ఎండీ.సల్మాన్ (24), మోసిన్ (25) మద్యం తాగి రాత్రివేళల్లో స్థానికంగా న్యూసెన్స్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిని అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపరిచారు. న్యాయమూర్తి వారికి రూ.1100ల చొప్పున జరిమానా విధించగా, వారు చెల్లించకపోవడంతో 4 రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

కానిస్టేబుళ్లను కారుతో ఢీకొట్టిన నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ గోపాలాకృష్ణమూర్తి


నిందితుడు సంపత్

కంటోన్మెంట్: పెట్రోలింగ్ విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లను కారుతో ఢీకొట్టి పరారైన వ్యక్తిని బోయిన్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బోయిన్‌పల్లి పోలీసుస్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బేగంపేట ఏసీపీ గోపాలా కృష్ణమూర్తి వివరాలు వెల్లడించారు. ఆదివారం రాత్రి బోయిన్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని డెయిరీ ఫామ్ రోడ్డులో కానిస్టేబుళ్ల ప్రవీణ్, చంటి ద్విచక్ర వాహనంపై గస్తీ నిర్వహిస్తున్నారు. నిర్మానుష్య ప్రదేశంలో ఆగి ఉన్న కారులో యువతి, యువకుడు ఉన్నట్లుగా గుర్తించి, వారిని సమీపిస్తుండగా, కారు డ్రైవర్ వేగంగా వారిని ఢీకొట్టి పరారయ్యాడు. ఈ ఘటనలో కానిస్టేబుళ్ల ప్రవీణ్, చంటికి గాయాలయ్యాయి. ప్రవీణ కాలు విరగ్గా, ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. సీసీ టీవీ కెమెరాల పుటేజీ ఆధారంగా కారును గుర్తించి, నిందితుడు సంపత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

బోనాల చెక్కుల జారీపై అధికారుల ఆరా


పద్మారావునగర్ పార్కులోని ఆలయాన్ని పరిశీలించిన అధికారులు

బన్సీలాల్‌పేట్: డివిజన్‌లోని పలు అమ్మవారి ఆలయాలకు బోనాల నిర్వహణకు అందజేస్తున్న చెక్కులపై పలు ఫిర్యాదులు..ఆరోపణలు రావడంతో దేవాదాయ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవిరెడ్డి, సురేశ్ తదితరుల కలిసి పద్మారావునగర్ పార్కులోని వన దుర్గా ఆలయాన్ని మంగళవారం సందర్శించారు. ఏటా బోనాలు ఎవరూ నిర్వహిస్తున్నారని అధికారులు అడిగి తెలుసుకున్నారు. వాకర్స్ అసోసియేషన్ తరఫున బోనాలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు లాయక్, వెంకటరమణ తదితరులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా చెక్కులను అందజేస్తున్నట్లు వారు తెలిపారు. బోనాల పేరిట ఆలయాలకు అందజేస్తున్న చెక్కులను కాజేసిన నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బన్సీలాల్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిరంజీవి డిమాండ్ చేశారు. దేవాదాయ శాఖ చెక్కుల అక్రమాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటి దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి


కార్మికులతో మాట్లాడుతున్న అజయ్‌బాబు

సికింద్రాబాద్: కార్మికుల హక్కుల పరిరక్షణకు ఈనెల 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సికింద్రాబాద్ సీపీఐ కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్ తరాల కార్మికులకు న్యాయం జరిగేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లోని కార్మికులందరూ సంఘటితంగా సమ్మెలో పాల్గొనాలన్నారు. కార్మికుల కనీస వేతనం రూ.26 వేలకు పెంచి, లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు కార్మికులు చేపట్టే ఆందోళనలకు తమ మద్దతు ఉంటుందని శ్రీనివాస్ స్పష్టం చేశారు.

సమ్మెను జయప్రదం చేయాలి

అడ్డగుట్ట: సమ్మెను జయప్రదం చేయలని కోరుతూ అడ్డగుట్ట, రైల్ నిలయం, లాలాగూడ రైల్వే ఆస్పత్రి, రైల్వే వర్క్‌షాప్, హైదరాబాద్ భవన్ తదితర ప్రాంతాల్లో సీఐటీయూ నాయకులు మంగళవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా జోన్ కన్వీనర్ అజయ్ బాబు మాట్లాడుతూ.. బుధవారం ఉదయం 10.30 గంటలకు సుందరయ్య పార్క్ నుంచి ఇందిరా పార్క్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ నిర్వహించనున్న మహాధర్నాలో కార్మికులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ నాయకులు డీఎల్ మోహన్, జగన్, కృష్ణ, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో పాల్గొనాలి

లాలాపేట: సార్వత్రిక సమ్మెలో కార్మికులందరు పాల్గొనాలని టీజీఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేశ్ పిలుపునిచ్చారు. తార్నాకలోని ఆర్టీసీ హాస్పిటల్ వద్ద మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కార్మికులకు న్యాయం జరిగే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

జీహెచ్‌ఎంసీ సిబ్బందికి కిట్ల పంపిణీ


కిట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శైలజ


కిట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్: డివిజన్ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ కంది శైలజ జీహెచ్‌ఎంసీ పారిశుధ్య సిబ్బందికి మంగళవారం శానిటేషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని దీంతోపాటు తమ ఆరోగ్యంపై కూడా శ్రద్ధ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ వెంకటేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతాఫల్‌మండి డివిజన్‌లో..

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక కార్పొరేటర్ సామల హేమ సీతాఫల్‌మండి డివిజన్ శానిటరీ సిబ్బందికి సేఫ్టీ కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో సిబ్బంది సేఫ్టీ కిట్లు ధరించి విధులు నిర్వర్తించాలని సూచించారు. డీఈఈ వెంకటేశ్, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రసూల్‌పురా: సికింద్రాబాద్ డివిజనల్ జూపీటర్ కాలనీ, మారుతీనగర్, ఏడబ్ల్యూహెచ్‌వో కాలనీ, శాస్త్రీనగర్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా ఈనెల 9న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సికింద్రాబాద్ ఏడీఈ కే. మురళీకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జూపీటర్ కాలనీ పరిసర ప్రాంతాలు, ఏడబ్ల్యూహెచ్‌వో ఏ బ్లాక్ నుంచి ఎం బ్లాక్ వరకు. అలాగే మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు టీచర్స్‌కాలనీ, గన్‌రాక్ విలేజ్, శాస్త్రీనగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఎయిర్‌పోర్ట్, ప్రకాశ్‌నగర్, బేగంపేట్ పరిధిలో..

సనత్‌నగర్: ఎయిర్‌పోర్ట్, ప్రకాశ్‌నగర్, బేగంపేట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ డివిజన్ ఆపరేషన్స్ డీఈ భీమానాయక్ మంగళవార ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు ప్రకాశ్‌నగర్, రాహుల్ బజాజ్ వెనుక ప్రాంతం, చీకోటి గార్డెన్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శాంతిబాగ్, శివబాగ్, కేకేజోన్ హోటల్ ప్రాంతాలు.

యువకుడికి 20 రోజుల జైలు


విశాల్

బౌద్ధనగర్: ఈ–పెట్టీ కేసులో యువకుడికి 20 రోజుల జైలు శిక్ష విధించిన ఘటన వారాసీగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పార్శిగుట్ట సంజీవపురానికి చెందిన ఆకుల విశాల్ (21) అనే యువకుడు ఇటీవల అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తితో గొడవ పడ్డాడు. అంతేగాకుండా స్థానికంగా కూడా న్యూసెన్స్ క్రియేట్ చేస్తున్నాడు. ఈ క్రమంలో స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు విశాల్‌పై వారాసీగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. సికింద్రాబాద్‌లో కోర్టులో మంగళవారం విశాల్‌ను ప్రవేశపెట్టగా మెజిస్ట్రేట్ 20 రోజుల జైలు శిక్ష విధించినట్లు వారు తెలిపారు.

యువతి అదృశ్యం


గీతాంజలి

రాంగోపాల్‌పేట్: యువతి అదృశ్యమైన ఘటన మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ప్రసాదరావు కుమార్తె గీతాంజలి (27) తన సోదరితో కలిసి సోమవారం మధ్యాహ్నం మోండా మార్కెట్‌కు షాపింగ్‌కు వెళ్లింది. పూజా సామగ్రి దగ్గర నుంచి ఆమె కనిపించకుండా పోయింది. వెంటనే సోదరి చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలించి ఇంటికి వెళ్లిపోయింది. బంధువులు, తెలిసిన వారి వద్ద వాకబు చేసినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తండ్రి మంగళవారం మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

9 మంది 'గాంధీ' ప్రొఫెసర్లకు ప్రమోషన్లు

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ, ఆస్పత్రుల్లో ప్రొఫెసర్లుగా విధులు నిర్వహిస్తున్న 9 మంది వైద్యులకు అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (ఏడీఎంఈ)గా ప్రమోషన్ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే వీరిని రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రులకు సూపరింటెండెంట్లు,మెడికల్ కాలేజీలకు ప్రిన్సిపాల్స్‌గా బదిలీ చేసింది. గాంధీ మాజీ సూపరింటెండెంట్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్‌ఓడీ శరవన్‌కుమార్‌ను సూర్యాపేట ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా, ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌ఓడీ సుభోధ్‌కుమార్‌ను కుమ్రం భీం ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. గాంధీ గైనకాలజీ హెచ్‌ఓడీ రాధాను కుత్బుల్లాపూర్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా, న్యూరో సర్జరీ హెచ్‌ఓడీ ప్రకాశరావును సంగారెడ్డి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, ఆర్థోపెడిక్ హెచ్‌ఓడీ వాల్యాను కామారెడ్డి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, కార్డియాలజీ హెచ్‌ఓడీ నితిన్‌కాబ్రాను మెదక్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, ఆప్తమాలజీ హెచ్‌ఓడీ రవిశేఖరరావును మహబూబాబాద్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, పిడియాట్రిక్ సర్జరీ హెచ్‌ఓడీ నాగార్జునను జోగులాంబ గద్వాల ఆస్పత్రి సూపరింటెండెంట్ గా, ట్యూబర్ క్లోసిస్ అండ్ క్రానిక్ డిసీజెస్ (పల్మనాలజీ) హెచ్‌ఓడీ ఎంజీ కృష్ణమూర్తిని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమిస్తూ వైద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చొంగ్తూ ఆదేశాలు జారీ చేశారు. 15 రోజుల్లో ఆయా పోస్టుల్లో చేరాలని సూచించారు.

యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వినతి


రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

లాలాపేట: రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30 శాతం ఉన్న గొల్ల కురుమలకు ప్రత్యేకంగా యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. కొమ్ము అశోక్ యాదవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాజ్యసభ సభ్యుడు ఎం అనిల్‌కుమార్ యాదవ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జిగా నియమితులైన సందర్భంగా డా. కొమ్ము అశోక్ యాదవ్, సందెవేన మహేంద్ర యాదవ్ ఆధ్వర్యంలో పలువురు గొల్ల కురుమ సంఘం నాయకులు హైదర్‌గూడలోని ఆయన కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించాలన్నారు. అలాగే 80 శాతం సబ్సిడీతో మినీ పాల డెయిరీల ఏర్పాటుకు రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు రుణాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, రాజాబాబు, దయ్యాల స్వామి, కాటవేని మహేశ్ యాదవ్, రాజేశ్, సతీశ్, మహేందర్ తదితరులున్నారు.

క్వార్టర్స్‌ను సందర్శించిన అధికారులు


ఐడీహెచ్ కాలనీలో క్వార్టర్స్‌ను సందర్శిస్తున్న అధికారులు

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ ఐడీహెచ్ కాలనీ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం క్వార్టర్స్‌ను జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులు మంగళవారం సందర్శించారు. ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఇండ్ల స్లాబ్ పెచ్చులూడుతున్నాయి. అదేవిధంగా వర్షాలకు ఉరుస్తున్నాయి. దీంతో జిల్లా గృహ నిర్మాణ శాఖ డివిజనల్ ఇంజినీర్ రాములు, అసిస్టెంట్ ఇంజినీర్ శిల్ప, సికింద్రాబాద్ మండల ఆర్‌ఐలు లక్ష్మీప్రసన్న, ఆదిల్‌తో పాటు బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్‌రాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా హౌసింగ్, రెవెన్యూ అధికారులు శిథిలావస్థకు చేరిన భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు వెంటనే క్వార్టర్స్‌కు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఉజ్జయినీ మహంకాళి ఆలయ బోనాల కమిటీ నియామకం


ఈఓతో మహంకాళి బోనాల కమిటీ సభ్యులు

రాంగోపాల్‌పేట్: ఈనెల 13,14వ తేదీల్లో మహంకాళి బోనాల జాతర జరుగనున్నది. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ కమిషనర్ 12 మందితో ఉత్సవ కమిటీని నియమించారు. ఈనెల 11 నుంచి 14 వరకు ఈ కమిటీ కొనసాగుతుంది. కమిటీ సభ్యులుగా గంటా గీత, ఠాకూర్ హేమంత్ సింగ్, రఘుకుల కృష్ణ, పాండురంగం, రాకేశ్ అగర్వాల్, ఆవుల శ్రీనివాస్, వనమాల అనిల్‌కుమార్, గుంట మల్లికార్జున, గుండెల్లి దేవి వరప్రసాద్, ఏతుకుల వేణుగోపాల్, పీట్ల జగదీశ్, శంభుల శ్రీకాంత్ గౌడ్‌ను నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డిని కలువగా ఆయన వారిని అభినందించారు.

వైఎస్‌ఆర్‌కు ఘన నివాళి

సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో దివంగత నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, వైఎస్‌ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. వైఎస్‌ఆర్ హయాంలో ఎంతో అభివృద్ధి జరిగిందని అలాగే 108 సేవలు, రాజీవ్ గృహకల్ప, స్వగృహ, ఇందిరమ్మ ఇళ్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ఎన్నో పథకాలు అమలు చేసి ఆయన నిరుపేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని వారు కొనియాడారు. – సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ జోన్ల బృందం


నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత


లాలాపేటలో నివాళులర్పిస్తున్న సురేశ్‌లాల్, నాయకులు


నివాళులర్పిస్తున్న డీబీ దేవేందర్


ఆశ్రయ్ ఆకృతి విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న దృశ్యం


పండ్లు పంపిణీ చేస్తున్న దాసరి మణిరత్నం

రెండో వివాహం చేసుకున్న వ్యక్తిపై కేసు

సనత్‌నగర్: భార్యను శారీరకంగా, మానసికంగా వేధించడమే కాకుండా రెండో వివాహం చేసుకున్న ప్రబుద్ధుడిపై సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సనత్‌నగర్ ఎస్సార్టీకాలనీలో నివాసం ఉండే చందన (26) నెల్లూరు జిల్లా కొత్తూరుకు చెందిన సుధీర్‌ను పెద్దల సమక్షంలో వివాహం చేసుకుంది. కొద్ది రోజుల పాటు వీరి దాంపత్య జీవితం సంతోషంగా సాగింది. వీరికి కుమారుడు ఉన్నాడు. కొన్ని నెలలుగా సుధీర్ తన భార్యను శారీరకంగా, మానసికంగా వేధించడం మొదలుపెట్టాడు. ఉద్యోగం చేయాలని ఒత్తిడి చేయగా ఆమె ప్రైవేట్ ఉద్యోగంలో చేరింది. తర్వాత ఆమెపై అనుమానంతో తరచూ ఆమె పనిచేసే కార్యాలయానికి వస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. గతేడాది డిసెంబర్‌లో భర్తతో గొడవ జరగడంతో చందన పుట్టింటికే వెళ్లిపోయింది. ఇదిలా ఉండగా కొన్ని రోజుల క్రితం ఆమె భర్త సుధీర్‌కు మనీషా అనే మరో యువతితో రెండో వివాహం జరిగిందని గోల్కొండ పోలీసుల ద్వారా తెలిసింది. భర్త వ్యవహారంపై నిలదీయగా బెదిరింపులకు పాల్పడ్డాడు. తనకు న్యాయం చేయాలంటూ బాధితురాలు సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాలు అపహరణ

సనత్‌నగర్: ఇంటి ముందు పార్కు చేసిన బైక్ అపహరణకు గురైన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సనత్‌నగర్ ఎస్సార్టీకాలనీలో నివాసం ఉండే అగ్రినేని జశ్వంత్ (23) గత నెల 18న అర్ధరాత్రి 12 గంటలకు ఏపీ 08కే 3002 నంబర్ గల బైక్‌ను తన ఇంటి ఎదుట పార్కు చేశాడు. మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటలకు చూసేసరికి బైక్ కనిపించలేదు. పలుచోట్ల వెతికినా దొరకలేదు. దీంతో బాధితుడు సనత్‌నగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరోచోట టీవీఎస్ ఎక్స్‌ఎల్..

ఎర్రగడ్డ మెట్రోస్టేషన్ సమీపంలో ఆదివారం పార్కు చేసి మార్కెట్‌కు వెళ్లివచ్చేసరికి టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనం చోరీకి గురైన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నిజాంపేట రాజీవ్ గృహకల్పలో నివాసం ఉండే బల్లా హరీశ్ (23) గత నెల 15న రాత్రి 7.30 గంటలకు తన టీవీఎస్ ఎక్స్‌ఎల్ (టీఎస్ 08 జీఎఫ్ 2865) ద్విచక్ర వాహనాన్ని మెట్రో పిల్లర్ నంబర్ 959 వద్ద పార్కు చేసి మార్కెట్‌కు వెళ్లాడు. తిరిగి 11.30 గంటలకు వచ్చి చూసేసరికి వాహనం కనిపించలేదు. సమీప ప్రాంతంలో వెతికినా ఫలితం లేదు. దీంతో బాధితుడు సనత్‌నగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.